క్లుప్తంగా

సన్మానం..



మండల విద్యాశాఖాధికారులు డి.గౌరి నాయుడు, ఆర్.ఆనందరావులను ఏపీటీఎఫ్ నాయకులు బుధవారం స్థానిక ఎంఆర్‌సీలో ఘనంగా సన్మానించారు. సంపూర్ణతా అభియాన్ సమ్మాన్ సమరతా అవార్డు పొందిన సందర్భంగా వీరినిసత్కరించినట్లు ఏపీటీఎఫ్ నాయకులు మురళీ, ధనుంజయనాయుడు, రామారావు, నరహరి, శ్రీనివాసరావు తెలిపారు. – వీరఘట్టం

అంగన్‌వాడీల ఆక్రందన వినబడడం లేదా..!

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కార్యకర్తల ఆక్రందనలు కూటమి ప్రభుత్వానికి వినపడడం లేదని కురుపాం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు ధ్వజమెత్తారు. స్థానిక విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడారు. కూటమి నేతలు ఎన్నికల సమయంలో అలవిగాని హామీలిచ్చి ఇప్పుడు వాటిని విస్మరించారన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు ఎన్నో హామీలిచ్చి వారిలో ఆశలు రేపారన్నారు. ఇప్పుడు వాటిని అమలు చేయలేక వారిపై లేనిపోని పనిభారాలు మోపి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మంచి మిత్రులతో మంచి అలవాట్లు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కళాధర్

వీరఘట్టం: మంచి మిత్రులను ఎన్నుకోవడం వల్ల మంచి అలవాట్లు వస్తాయని ఎస్సై జి. కళాధర్ అన్నారు. మండలంలోని గంగమ్మపేట గిరిజన ఆశ్రమ పాఠశాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక విద్యాభ్యాసంలో రాణిస్తేనే ఉన్నత చదువులకు బాటలు పడతాయని చెప్పారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కరరావు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరుణించని వరుణుడు



లుంబూరు – కోటిపల్లి మధ్య బీటలువారిన పొలం

పాలకొండ రూరల్: తోటపల్లి కాలువల ద్వారా సాగునీరు ఆశించిన మేర అందకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. గడిచిన 18 రోజులుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. బుధవారం సాయంత్రం ఆకాశం మేఘావృతం కావడంతో వర్షం పడుతుందని ఆశించిన రైతన్నకు నిరాశే మిగిలింది. మండల పరిధిలోని గరుగుబిల్లి, లుంబూరు, ఓని, రుద్రిపేట, సిరికొండ, వెలగవాడ, ఎన్‌కె.రాజపురం, సింగన్నవలస, తదితర ప్రాంత రైతులు వేసిన వరి పంట భూములు బీటలువారాయి. ఇప్పటికే అధికారుల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న కర్షకులు చినుకు పడక...కునుకు పట్టక ప్రత్యామ్నాయ ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు.

మొక్కజొన్న సాగు..
రైతుకు బాగు



పసుకుడిలో ఆరబెట్టిన మొక్కజొన్న గింజలు

● తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు

భామిని: పాలకొండ డివిజన్‌లో మొక్కజొన్న సాగు జోరుగా సాగుతోంది. ఈ ఏడాది ఘననీయంగా పంట మార్పిడి చేసి రైతుల మొక్కజొన్న సాగుపై దృష్టి సారించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించే అవకాశం ఉన్నందున అన్నదాతలు సాగుకు ముందుకు వస్తున్నారు. మొక్కజొన్న సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయాధికారులు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. భామిని, సీతంపేట, పాలకొండ, వీరఘట్టం మండలాల్లో ప్రతి సంవత్సరం సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రస్తుతం ఎకరాకు సరాసరిని 25 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తోందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

పాలకొండ నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం	
భామిని	1089 ఎకరాలు
వీరఘట్టం	300 ఎకరాలు
పాలకొండ	520 ఎకరాలు
సీతంపేట	210 ఎకరాలు

భూసారాన్ని బట్టి 20 నుంచి 30 క్వింటాళ్ల వరకు కూడా దిగుబడి వచ్చే అవకాశం ఉందంటున్నారు.

మొక్కజొన్న పంటను వర్షాధారంపైన.. ఆయకట్టు కింద కూడా సాగు చేసుకోవచ్చని సూచిస్తున్నారు. మొక్కజొన్న ఆహార పంటగానే కాకుండా పశువులు, కోళ్ల దాణాకు వినియోగిస్తున్నారు. అలాగే పారిశ్రామికంగా కొన్ని ఉత్పత్తుల్లో కూడా మొక్కజొన్నను వినియోగిస్తున్నారు.

సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

మొక్కజొన్న సాగుకు మురుగునీరు పోయే లోతైన ఎర్ర గరప, మధ్యస్థ నల్ల నేలలు బాగా అనుకూలం. నీరు నిల్వ ఉండే ముంపు నేలలు, చౌడు నేలల్లో మొక్కజొన్న దిగుబడి సరిగా రాదు. జీరో టిల్లేజ్ పద్ధతిలో పొలంలో దుక్కి లేకుండా కూడా నాటుకోవచ్చు. వరి దుబ్బుల్లోనే గొయ్యి తవ్వి విత్తనం వేసుకోవచ్చు. అప్పటికే పొలంలో ఉండే తేమ, ఎరువుల సత్తువతో మొలకలు బాగా వస్తాయి. దుక్కి ఖర్చు లేకుండా విత్తుకోవడంతో పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. దీర్ఘకాలిక పంట రకాలైతే 100 – 120 రోజుల్లో దిగుబడి వస్తుంది. మధ్యకాలిక రకాలతై 90 – 100 రోజుల్లో.. స్వల్పకాలిక రకాలైతే 90 రోజుల్లోపే పంట చేతికొస్తుంది.

ప్రత్యామ్నాయ పంటగా ప్రోత్సాహం..



పాలకొండ డివిజన్‌లో మొక్కజొన్న పంట విస్తీర్ణం పెరుగుతోంది. మొక్కజొన్న వినియోగం కూడా పెరగడంతో గిరాకీ నెలకొంది. పంట మార్పిడిలో పత్తికి బదులు మొక్కజొన్న సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించవచ్చు. ఈ విషయంలో రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం.

– కె. రత్నకుమారి, వ్యవసాయ సహాయ సంచాలకులు, పాలకొండ



నేరడిలో మొక్కజొన్న పంటకు మందు కొడుతున్న రైతు

కూటమి పాలనపై అసంతృప్తి



తురకనాయుడువలసలో కూటమి వైఫల్యాలను వివరిస్తున్న మండల కన్వీనర్ కోట రమేష్

జియ్యమ్మవలస: కూటమి పాలన అస్తవ్యస్తంగా ఉందని, ప్రజలంతా అసంతృప్తిగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కోట రమేష్ అన్నారు. ఇటిక, తురకనాయుడువలస గ్రామాలలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అబద్ధాలు, మోసాలతో పాలన సాగిస్తోందన్నారు. గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి కూటమి పాలన గురించి వివరించారు. ఎన్నికల హామీలు అమలు తీరు చూస్తే విడ్డూరంగా ఉందన్నారు. గ్యాస్ డబ్బులు, యువతకు నిరుద్యోగ భృతి, 18 సంవత్సరాలు నిండిన మహిళలకు నెలకు రూ.1500 వచ్చాయా.. అని అడిగారు. హామీలన్నీ ఏమయ్యాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి



చినమేరంగిలో యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అవినాష్

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి రెల్లి వీధిలో ఎస్‌ఐ అవినాష్ యువతతో బుధవారం సమావేశం నిర్వహించారు. నషాముక్త్ భారత్ అభియాన్ యాక్టివిటీలో భాగంగా యువత మత్తు పదార్థాలు సేవిస్తే కలిగే నష్టాలను వివరించారు. యువత సారా, మత్తు పదార్థాలు జోలికి వెళ్తే తమ జీవితాన్ని నాశనం చేసుకున్నట్లేనని అన్నారు. బాగా చదువుకొని మంచిగా స్థిరపడాలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకత కోసమే సామాజిక తనిఖీలు



గిజబలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న ఎస్‌ఆర్‌పీ

గరుగుబిల్లి: ఉపాధి హామీ పనులలో పారదర్శకత కోసమే సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్‌ఆర్‌పీ పున్నపునాయుడు అన్నారు. మండలంలోని గిజబలో సామాజిక తనిఖీలకు సంబంధించి సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి అధ్యక్షతన గ్రామ సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎంజీ ఎన్‌ఆర్‌ఈజీఎస్‌కు సంబంధించిన ఏప్రిల్ 2024 నుంచి మార్చి31, 2025 వరకు నిర్వహించిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీలను నిర్ణయ యాప్ ద్వారా చేపట్టినట్టు తెలిపారు. మండలంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న 19వ విడత సామాజిక తనిఖీలలో రూ.20.07కోట్లకు సంబంధించి నిర్వహించిన పనులను తనిఖీ చేస్తామన్నారు. గ్రామాలలో తనిఖీలను నిర్వహించిన అనంతరం ఈ నెల 22న మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదికను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మరడాన సింహచలంనాయుడు, మాజీ ఎంపీటీసీ మండల శంకరరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే భవిష్యత్‌కు భరోసా

● జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానాలతోనే భవిష్యత్‌కు భరోసా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ అన్నారు. మండలంలోని తోటపల్లిలోని జట్టు ఆశ్రమంలో ప్రకృతి వ్యవసాయ విధానంపై నిర్వహిస్తున్న శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో పూర్తి విస్తీర్ణంలో పంటలు సాగు చేసుకుంటే ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. రీజనల్ తీమోటిక్ లీడ్ కె.ప్రకాష్, డీపీఏ ఎం.శ్రావణ్‌కుమార్ నాయుడు మాట్లాడుతూ రసాయన ఎరువులు వినియోగించకుండా పంటలను సాగు చేస్తే ఆరోగ్యం బాగుటుందన్నారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రోత్సహకాలను అందించి ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ, వీహెచ్‌ఏలు, ఏఈవోలు పాల్గొన్నారు.

నత్రజని ఎరువులను మూడు దఫాలుగా వేయాలి

గుమ్మలక్ష్మీపురం: వరి పంటకు నత్రజని ఎరువులను మూడు దఫాలుగా వేయాలని ఏవో పి.శంకరరావు అన్నారు. మండలంలోని మండ గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ నత్రజని ఎరువును (యూరియా) వరి పంటలో ఎకరాకు మొదటిసారి ఆఖరి దమ్ములో 25 కేజీలు, రెండవసారి పిలకలు వేసే సమయంలో 25 కేజీలు, చిరుపొట్ట దశలో ఇంకో 25 కేజీలు వేయాలని చెప్పారు. అలాగే భాస్వరం ఎరువును ఆఖరి దమ్ములో 50 కేజీలు వేసి, పొటాష్ ఎరువును 30 కేజీలు ఆఖరి దమ్ములో 15 కేజీలు మరియు చిరుపొట్ట దశలో 15 కేజీలు వేయాలన్నారు. తద్వారా పంటల దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఎం.శిరీష, విస్తరణ అధికారి ఎ.శివ పాల్గొన్నారు.

పీఓ ఆధ్వర్యంలో నియామకాలు జరగాలి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం, సీతంపేట, పాడేరు ఐటీడీఏల పరిధిలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఆయా ఐటీడీఏల పీవోల ఆధ్వర్యంలో నియామకాలు చేపట్టాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆ పోస్టుల్లో నియామకపు అధికారం ప్రిన్సిపాళ్లకు ఇవ్వడం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ పోస్టులను ఆయా జిల్లాల్లోని అర్హులైన గిరిజన అభ్యర్థులతో మాత్రమే భర్తీ చేయాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏలకు రెగ్యులర్ పీవోలను కూటమి ప్రభుత్వం నియమించలేదని, ఈ నేపథ్యంలో ఎఫ్‌ఏసీ పీవోలుగా విధులు నిర్వహిస్తున్న అశుతోష్ శ్రీ వాస్తవ, యశ్వంత్ కుమార్‌రెడ్డిలను రెగ్యులర్ పీవోలుగా నియమించి ఇదే స్థానాల్లో కొనసాగించాలని కోరారు.

గోకుల నిర్మాణాల పరిశీలన



గోకులాలను పరిశీలిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: మండలంలోని పీపీ ఈతమానుగూడ, ఆనపకాయలగూడలలో ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి బుధవారం పర్యటించి గోకులాల షెడ్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ కుమార్, డీఈఈ నాగభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..



ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

పాలకొండ రూరల్: ఎన్‌కె.రాజపురం నుంచి పాలకొండ ఏరియా ఆస్పత్రికి వెళ్లే రహదారిలో ఉన్న కల్వర్టు దిగువ భాగంలో ఇటీవల పూడికలు తీశారు. ఇక్కడవరకూ బాగానే ఉన్నా కల్వర్టులకు ఇరువైపులా రెయిలింగ్ లేకపోవడంతో ఏమాత్రం ఆదమరిచి ఉన్నా ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుకు రెయిలింగ్ గాని రక్షణ గోడ గాని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

● సందడిగా ఫ్రెషర్స్ డే..



భామిని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్స్‌పాల్ ఎస్‌వీఎల్ నారాయణరావు ఆధ్వర్యంలో విద్యార్థులు నృత్యాలతో అలరించారు. కొత్త విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సామూహిక భోజనాలు చేశారు. – భామిని

నవోదయ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

వీరఘట్టం: మండలంలోని కిమ్మి మోడల్ ప్రైమరీ స్కూల్‌లో చదువుతున్న ఐదో తరగతి విద్యార్థులకు నవోదయ ప్రవేశ పరీక్ష మెటీరియల్‌ను బుధవారం పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం జి.సింహాచలం తెలిపారు. విశాఖపట్నంలోని మారికివలస ఎస్‌ఎస్ కోచింగ్ సెంటర్ వారు అందజేసిన ఈ మెటీరియల్‌ను మాజీ సర్పంచ్ గురాన వెంకటరమణమూర్తి చేతుల మీదుగా అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బంకురు అప్పలనాయుడు, బి.వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాన ప్రస్థాశ్రమం, గోశాల ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా వున్న అన్నదాన భవన నిర్మాణం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీకోదండ రామస్వామి ఆలయాలలో ఈ నెల 7న గురువారం నూతనంగా నిర్మించిన వాన ప్రస్థాశ్రమం, అన్నదాన సత్రం, గోవింద గోశాలను ప్రారంభించనున్నట్టు టీటీడీఎస్ ట్రస్టు సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తదితరులు హాజరు కానున్నట్టు తెలిపారు. దాతల సహకారంతో వాన ప్రస్థాశ్రమం, గోశాల నిర్మాణం పనులు పూర్తి చేశారు.

జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యోగాలకు ఎంపికైన యువతకు ఆర్డర్లు అందిస్తున్న కంపెనీ ప్రతినిధులు

పాలకొండ: జాబ్‌మేళాలలను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె. సాయికృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. పట్టణంలోని తమ్మినాయుడు డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం జాబ్‌మేళాకు హాజరైన 128 మంది నిరుద్యోగులకు 12 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించగా.. 34 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం. తిరుపతిరావు, నైపుణ్యాభివృద్ధి సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం



సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న ఎంపీటీసీ సింహాచలం నాయుడు, తదితరులు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి గ్రామ సచివాలయ ఉద్యోగులకు ప్రజాప్రతినిధులు, ప్రజలు బుధవారం ఘనంగా సన్మానించారు. బుధవారం గ్రామ సచివాలయంలో ఇటీవల బదిలీపై వెళ్లిన గ్రామ సచివాలయ సిబ్బంది వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్ తదితరలకు తోటపల్లి, గిజబ గ్రామ సర్పంచ్‌లు ఆవాల సింహచలమమ్మ, మండల భాగ్యలక్ష్మితో పాటు పలువురు దుశ్శాలువాతో పాటు జ్ఞాపికలను అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మరడాన సింహచలం నాయుడు, మాజీ ఎంపీటీసీ మండల శంకరరావు, నాయకులు ఆవాల కన్నయ్య, ఎం.అశోక్, ఆవాల రామకృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

శిక్షకులు కుట్టుమూర్తులు తయారు చేయాలి



శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: బీసీ కార్పొరేషన్ ద్వారా స్థానిక ఉన్నత పాఠశాల భవనాల్లో కుట్టు శిక్షణ పొందుతున్న వారంతా కుట్టుమూర్తుల తయారీకి సిద్ధం కావాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఉన్నత పాఠశాల అదనపు గదుల్లో జరుగుతున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షకుల నుద్దేశించి మాట్లాడుతూ మహిళలంతా కుట్టు శిక్షణ పొందడం అభినందనీయమని, కుట్టు మూర్తులు తయారీతో కుటుంబానికి కొంత ఆదాయం వస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ కుటీరపరిశ్రమ నెలకొల్పి కుటుంబానికి ఆసరాగా తయారు కావాలని పిలుపునిచ్చారు. ఇక్కడ తయారుచేస్తున్న కుట్టుమూర్తులను పరిశీలించారు. కుట్టుమూర్తుల తయారీలో వారి అనుభవాలను తెలుసుకున్నారు.

మరుగుదొడ్లు లేక ఇక్కట్లు



కంబరవలస ప్రాథమిక పాఠశాల

వీరఘట్టం: మండలలలోని కంబరవలస ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. 11 మంది విద్యార్థులు చదువుతుండగా.. ఒక ఉపాధ్యాయురాలు వీరికి విద్యాబోధన చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయురాలు కూడా ఆరుబయటకు పరుగులు తీయాల్సి వస్తోంది. వాస్తవానికి ఈ పాఠశాలకు గతంలో మరుగుదొడ్లు ఉండేవి. పక్కనే పంచాయతీ కార్యాలయానికి నూతన భవనం నిర్మించడంతో మరుగుదొడ్లను తొలగించేశారు. మరుగుదొడ్లు లేకపోతే విద్యార్థులు ఇబ్బంది పడతారనే విషయాన్ని కూడా పట్టించుకోకుండా మరుగుదొడ్లు తొలగించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించి పాఠశాలకు మరుగుదొడ్లు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



సీతంపేట: గొయిదిలో పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న లబ్ధిదారులు, ఐసీడీఎస్ సిబ్బంది



భామిని: బురుజోలలో తల్లిపాల వారోత్సవాల ప్రదర్శనలో మాట్లాడుతున్న ఎస్‌ఓ సబితా పట్నాయక్



పాలకొండ రూరల్: ఎం.సింగుపురంలో తల్లిపాల విశిష్టతను వివరిస్తున్న అధికారులు



గరుగుబిల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన ర్యాలీ

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు..

ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టాలని ఐసీడీఎస్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, వక్తలు సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వాడవాడలా బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టతను వివరించారు. బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని.. పాలల్లో రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉండడం వల్ల బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అలాగే గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్